## వీరన్నపేటలో తెలంగాణ తల్లి విగ్రహం



వీరన్నపేటలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, ఆగస్టు 5 : మండలంలోని వీరన్నపేటలో త్వరలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే వీరన్నపేటకు వచ్చిన సందర్భంగా పలువురు యువకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కలిసి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయమని కోరడంతో వెంటనే ఏర్పాట్లు చేసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కరుణాకర్, మల్లేశం, దాసు, యాదగిరి, ఎల్లారెడ్డి, బాలరాజు, సిద్ధప్ప,నవీన్‌రెడ్డి, శివ శంకర్‌గౌడ్, బండమీది కరుణాకర్, కిషన్, నర్సయ్య పంతులు, కొండ శ్రీనివాస్, కనకయ్య, పైస లింగం పాల్గొన్నారు.

### మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌కు పరామర్శ

చేర్యాల, ఆగస్టు 5 : మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి తల్లి పుష్ప ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం చంటి ఇంటికి వెళ్లి మృతురాలు పుష్ప చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి, శ్రీధర్, బద్దిపడిగె కృష్ణారెడ్డి, సతీశ్‌గౌడ్, యాట కనకమ్మయాదగిరి తదితరులున్నారు.

## తాజా కూరగాయలు విక్రయించేలా పర్యవేక్షించాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాన్‌వెజ్ బ్లాక్‌ను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, ఆగస్టు 5 : వినియోగదారులకు తాజా కూరగాయలు, మాంసం, చేపలను విక్రయించేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని సమీకృత మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లోని మాంసం, కూరగాయలు, చేపలు అమ్ముకోవడానికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. మార్కెట్ కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ.. ఐదేండ్ల క్రితం ప్రభుత్వం రూ.25 కోట్లతో సమీకృత మార్కెట్‌ను నిర్మించిందని, హోల్‌సెల్‌గా కూరగాయలు అమ్ముకోవడానికి ప్రత్యేకమైన బ్లాక్‌లను నిర్మించి వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. మార్కెటింగ్ శాఖ ద్వారా 14మంది ఉద్యోగులు ఇక్కడ ఉన్నారని కలెక్టర్‌కు వివరించారు. మార్కెట్‌లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అగర్వాల్

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 5 : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. 5 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవకిదేవి, అధికారులు పాల్గొన్నారు.

## చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 5: తినేముందు చేతులను శుభ్రం చేసుకునే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత అన్నారు. పట్టణంలోని మైనార్టీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చేతుల శుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.



మర్కూక్ : పాములపర్తిలో విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

# ఊరూరా స్వచ్ఛదనం-పచ్చదనం

- కార్యక్రమంపై అవగాహన కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- చెత్తను తొలిగించారు.. మొక్కలు నాటారు..
- గ్రామాల్లో ర్యాలీల నిర్వహణ - పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, ప్రజాప్రతినిధులు, అధికారులు

సిద్దిపేట జిల్లాలో స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమంపై వీధివీధినా ప్రజలకు అవగాహన కల్పిస్తూ... ఆయా ప్రాంతాల్లో చెత్తను తొలిగించే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తను తొలిగించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, సిద్దిపేట ఆగస్టు 5



హుస్నాబాద్ టౌన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చెత్తను తొలిగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు



గజ్వేల్ : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చైర్మన్ రాజమౌళి



కొమురవెల్లి : ఐనాపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ



మిరుదొడ్డి: లింగుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



వర్గల్ : తున్కిఖల్సాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో



సిద్దిపేట : ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, పాలకవర్గ సభ్యులు, అధికారులు

## దళిత మహిళ పై థర్డ్ డిగ్రీ ప్రయోగం దారుణం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 5 : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దళిత బహుజనులకు రక్షణ కరువైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేర్గు మహేశ్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వమని చెబుతూ ప్రశ్నించిన వారిపై పోలీసులతో దాడులు చేయిస్తున్నారన్నారు. షాద్‌నగర్‌లో దళిత మహిళకు దొంగతనం చేసిందని అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీని ప్రయోగించి, బట్టలూడదీసి నీచంగా వ్యవహరించిన సీఐ రాంరెడ్డిని సర్వీస్ నుంచి తొలిగించకుండా సీపీ కార్యాలయానికి అటాచ్ చేయడమంటే తన సామాజిక వర్గానికి చెందిన అధికారిని కాపాడుకోవడమేనని యావత్తు సమాజం భావిస్తుందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేయించి ఆ అధికారిపై సస్పెన్షన్ విధించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ జూజుల చందు,నాయకులు మధు,బాలపోచయ్య,దాసరి రమేశ్, నరేశ్, బోస్‌రాజు, పోచయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్ రాజ్యమా.. పోలీస్ రాజ్యమా?

సిద్దిపేట టౌన్, ఆగస్టు 5 : పోలీసులు దళిత మహిళ పట్ల ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో దొంగతనం అంగీకరించాలని దళిత మహిళ సునీతను ఆమె భర్త భీమయ్యపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. విచారణ పేరుతో దళిత మహిళను హింసించిన పోలీసులను సస్పెండ్ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 5 : ప్రజావాణిలో వచ్చే అర్జీదారుల సమస్యలు అధికారులు ప్రత్యేక చొరవ చూపి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ఆర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కి భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లు గురించి వచ్చిన దరఖాస్తులు 50 స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పవిత్ర శ్రావణమాసం ఆరంభం కావడంతో ఆలయాలకు శ్రావణమాసం శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా సోమవారం శివాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. సిద్దిపేట పట్టణంలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు అర్చనలు భక్తులు భారీగా వచ్చి పూజలు చేశారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్, ఫొటోగ్రాఫర్ సిద్దిపేట జిల్లా , ఆగస్టు 5

## నేడు మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్, ఆగస్టు 5: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం హుస్నాబాద్‌లో పర్యటిస్తున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసింది. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కొత్త చెరువు వద్ద మొక్కలు నాటడంతో పాటు పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారని తెలిపారు.

## నేడు అమరవీరుల జయంతి, వర్ధంతి సభలు

హుస్నాబాద్/హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 5: తెలంగాణ ఉద్యమకర్త ప్రొఫెసర్ జయశంకర్‌సార్ జయంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్, ప్రజా గాయకుడు అలీఖాన్ వర్ధంతి సభ మంగళవారం హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్నామని జేఏసీ నాయకుడు కావ్య లక్ష్మారెడ్డి, జాగృతి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ వేర్వేరుగా తెలిపారు. ఈ సభకు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు, యువత, విద్యార్థులు తరలి రావాలన్నారు.

## రేపటి నుంచి అథ్లెట్స్ పోటీలు

వర్గల్, ఆగస్టు 5: వర్గల్ జవహర్ నవోదయ కేంద్రియ విద్యాలయ సమితిలో ఈ నెల 7, 8 తేదీల్లో క్లస్టర్ లెవల్ అథ్లెట్స్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, హర్డిల్స్, మారథాన్, డిస్కస్‌త్రో, జావెలింగ్‌త్రో, హ్యామర్‌త్రో తదితర పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని అదిలాబాద్, మెదక్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లోని కేంద్రియ నవోదయ విద్యాలయ సమితికి చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో జరిగే ప్రాంతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## సర్కారు దవాఖానలో అరుదైన శస్త్ర చికిత్సలు

దుబ్బాక, ఆగస్టు 5 : దుబ్బాక వంద పడకల దవాఖానలో సోమవారం మూడు అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు వైద్యాధికారి హేమరాజ్ తెలిపారు. మెదక్ జిల్లా గంగాపూర్‌కు చెందిన బోయిని లక్ష్మికి 6 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డను శస్త్ర చికిత్స ద్వారా తొలిగించామని తెలిపారు. దుబ్బాకకు చెందిన అజ్జ లావణ్యకు 4 కిలోల మల్టీపుల్ ఫైబ్రాయిడ్ గడ్డతోపాటు గర్భసంచి తొలిగించినట్లు తెలిపారు. దుబ్బాక మండలం చీకోడు గ్రామానికి చెందిన దీక్షిత 4 నెలల గర్భిణికి 5 కిలోల ఓవరియన్ సిస్ట్‌ను తొలిగించామని తెలిపారు.

## చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

గజ్వేల్, ఆగస్టు 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి నిధులు కేటాయించాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయకులు రాములు, ఉప్పల మధు, శేఖర్ పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కొమురవెల్లి, ఆగస్టు 5 : కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ దళితమోర్చా మండలాధ్యక్షుడు బచ్చలి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పుట్ట కనకరాజు, ఉపాధ్యక్షులు వంగ శివారెడ్డి, మద్దికుంట కరుణాకర్, బ్రహ్మాండ్లపల్లి బాబు, బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు సానాది కరుణాకర్ పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజుగౌడ్

కొమురవెల్లి, ఆగస్టు 5 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై రాజుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఐనాపూర్‌ను ఎస్సై సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. యువత ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్



చేర్యాల, ఆగస్టు 5 : చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా నాగేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల సర్కారు చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా నాగేందర్ చేర్యాల కమిషనర్‌గా ఇక్కడికి వచ్చారు.


### సబ్ రిజిస్ట్రార్‌గా మనోహర్

చేర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా మనోహర్ ఇటీవల విధుల్లో చేరారు. కరీంనగర్ రిజిస్ట్రేషన్ల శాఖలోని భాగమైన ఎంవీ అడిట్ నుంచి మనోహర్ చేర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. దీంతో మనోహర్ సోమవారం నుంచి పనులు ప్రారంభించారు.

## చోరీ కేసులో నిందితులకు రిమాండ్

ములుగు, ఆగస్టు 5 : చోరీ కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు... మండల పరిధిలోని అచ్చాయపల్లిలో గత నెల 27న కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటి వద్ద పెద్ద మొత్తంలో సెంట్రింగ్ బాక్సులను, 25న ములుగు గ్రామ శివారులో ఓ ఆటోను దొంగిలించిన మేడ్చల్ జిల్లా పూడూరుకు చెందిన నర్సింగరావు, మల్లేశ్, భూమేశ్, మెదక్ జిల్లా ఇబ్రహింపూర్‌కు చెందిన రాజు, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ అశ్రఫ్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన రమేశ్‌లను చాకచక్యంగా పట్టుకొన్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో అన్నదానం



కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 5 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళ విభాగం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల హక్కులను పరిరక్షించాలి



కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేగ సభ్యులు

గజ్వేల్, ఆగస్టు 5 : జాతీయ ఉపాధి హామీ కూలీల హక్కులను పరిరక్షించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేశ్ కుమార్ బృందానికి ఢిల్లీలో నరేగ సంఘర్షణ సమితి జాతీయ బృందం సభ్యులు విన్నవించారు. సోమవారం ఢిల్లీలోని కృషి భవన్‌లోని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆరుగురు అధికారుల బృందంతో వివిధ రాష్ట్రాలకు చెందిన అనురాధ (పశ్చిమబెంగాల్), ఆభయ్ (కర్ణాటక), అశిష్, రంజన్ (బీహార్), ముఖేష్(రాజస్థాన్), పి.శంకర్, పులి కల్పన(తెలంగాణ), రాహుల్(ఏపీ), రాజశేఖర్ (యూపీ), నీతు(గుజరాత్)లతో పాటు దళిత, ప్రజా, కార్మిక సంఘాలకు చెందిన 15 మంది బృందం సభ్యులు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఏడు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా బృందం సభ్యులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## మీర్జాపూర్‌లో నాటు బాంబు కలకలం



ఘటనా స్థలంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 5: మండలంలోని మీర్జాపూర్‌లో ప్రమాదవశాత్తు నాటు బాంబు పేలి యువకుడికి గాయాలైన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. సోమవారం ఉదయం మీర్జాపూర్‌కు చెందిన ఎండీ ఖలీల్ తన పశువులను మేపేందుకు గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పశువులను తాళ్లతో కట్టేసి ఉంచేందుకు భూమిలోకి మేకును కొడుతుండగా నాటు బాంబు పేలింది. ఈ ఘటనలో ఖలీల్ చేతితో పాటు కాలికి గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ సందర్శించారు. ఈ నాటు బాంబులు అడవి పందులను వేటాడేందుకు వేటగాళ్లు పడేసినట్లు అనుమానిస్తున్నారు. నాటు బాంబులు గతంలో వేసినవా...? లేక ఇటీవల వేసినవా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఆదుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మల్లన్నసాగర్ భూ నిర్వాసితులు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 5 : మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఆదుకోవాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ అన్నారు. సోమవారం ముంపు గ్రామాల ప్రజలకు రావాల్సిన పరిహారం అందించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే నిర్వాసితులకు సంబంధించిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులను ఏకం చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా

హుస్నాబాద్, ఆగస్టు 5 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌బాబు, శ్రీనివాస్, కిశోర్, రాంప్రసాద్, కిష్టయ్య, అరుణ్‌కుమార్, లక్ష్మయ్య, నరేశ్, రాజేందర్, రవి, అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 5: హుస్నాబాద్ మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సిబ్బందితో పాటు పూర్తిస్థాయి అధికారులను నియమించి పరిపాలన సక్రమంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ

చేర్యాల, ఆగస్టు 5 : బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి తల్లి ఇటీవల మృతి చెందడంతో సోమవారం ఆయన కుటుంబ సభ్యులను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మృతురాలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి కృషి చేయాలి

చేర్యాల, ఆగస్టు 5 : మహిళల సంక్షేమానికి నూతనంగా ఎన్నికైన పట్టణ, మండల అధ్యక్షులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని కొమ్మూరి నివాసంలో జిల్లా కమిటీతో పాటు చేర్యాల పట్టణం, మండల మహిళా అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా కళావతి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా భాగ్యతో పాటు పలు కమిటీలకు నియామక పత్రాలు అందజేశారు.

## నాయకుడిగా ఎదగడానికి బీఆర్ఎస్వీ బీజం



నూతన కమిటీకి నియామక పత్రాలను అందిస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 5 : ఉత్తమ నాయకుడిగా ఎదగడానికి బీఆర్ఎస్వీ బీజం వేస్తున్నదని బీఆర్ఎస్వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రెడ్డి యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్వీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్‌ను, విద్యార్థిని విభాగం అధ్యక్షురాలిగా రమాదేవిని, కన్వీనర్‌గా రమ్యను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందించి సత్కరించారు. అంతకుముందు నూతనంగా బదిలీపై వచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ సునీతను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మహిపాల్ గౌడ్, నేతలు శ్రీకాంత్, రాజు, సతీశ్, నరేష్, రమేశ్, రాము యాదవ్, భానుప్రసాద్, వంశీ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీను, జానకి, చందు, నాగరాజు, ప్రభాకర్ కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై పునఃపరిశీలించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పును పునఃపరిశీలించి రాజ్యాంగ బద్ధమైన న్యాయం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు సత్తయ్య, శ్రీనివాస్, మేర్గు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పొట్లపల్లిలో జడ్పీ సీఈవో పర్యటన



పొట్లపల్లిలో పర్యటిస్తున్న జడ్పీ సీఈవో రమేశ్ తదితరులు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 5 : మండలంలోని పొట్లపల్లిలో సోమవారం జడ్పీ సీఈవో సీహెచ్ రమేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పలు వీధులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీసీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జగత్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి ప్రథ్వీరాజ్, గ్రామస్తులు ఉన్నారు.

## కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలి

జగదేవపూర్ ఆగస్టు 5 : భవన నిర్మాణ రంగంలో పని చేస్తున కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని బీఎన్ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు నర్రా భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆవిర్భావ వేడకలను పురస్కరించుకొని మునిగడప గ్రామంలో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఆశయ్య, నారయణరెడ్డి, బాలయ్య, నర్సింహులు, మల్లేశం, రమేశ్ తదితరులు ఉన్నారు.